సాక్షి
అనకాపల్లి
గురువారం । 26 । జనవరి । 2023



భాష పరిరక్షణే లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషను పరిరక్షిస్తోందని తెలుగు, సంస్కృతం అకాడమీ చైర్పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. 8లో



లక్ష్య నిర్దేశకులదే విజయం

'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. రెండో రోజు పోటీల్లో లక్ష్య నిర్దేశకులే విజయం సాధించారు. 8లో



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్

ఏయూ వేదికగా మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. 8లో

విజయం మనదే..

- కార్యకర్తల సమష్టి కృషితో గెలుపు సునాయాసం
- అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లండి
- చోడవరం సమావేశంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

చోడవరం: రానున్న ఎన్నికల్లో పార్టీ భారీ విజయం సాధించి తిరిగి అధికారంలోకి వచ్చే విధంగా కార్యకర్తలంతా సమష్టిగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం చోడవరంలో బుధవారం జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ 2019లో కనీవినీ ఎరుగని రీతిలో సాధించిన విజయంలాగే.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కార్యకర్తలంతా రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి అంతకంటే భారీ మెజార్టీతో గెలుపు అందించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో గడిచిన నాలుగేళ్లలో దేశంలో ఎక్కడా అమలు కానన్ని సంక్షేమ, అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి సామాన్యులకు సైతం నవరత్న పథకాలు అందించామన్నారు. ముఖ్యమంత్రి విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, గోరుముద్దతోపాటు నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నారన్నారు. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీ నిర్మిస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలతో వ్యవసాయం పండగలా సాగుతోందన్నారు. ప్రభుత్వ పాలనకు వస్తున్న ప్రజాదరణను తట్టుకోలేక టీడీపీ, జనసేన నాయకులు, వారి అనుకూల మీడియా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని, ఈ యత్నాలను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తిప్పికొట్టాలన్నారు. ఇంటింటికీ వెళ్లి వాస్తవాలను వివరించాలని కార్యకర్తలకు సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. చోడవరం నియోజకవర్గంలో 9 వేలమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణాలు చేపట్టామన్నారు.

రూ.130 కోట్లతో ఇంటింటికీ తాగునీరు

పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రూ.130 కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందించడంతోపాటు అనుబంధ గ్రామీణ రోడ్లను వేశామన్నారు. సచివాలయ భవనాలు, హెల్త్ సెంటర్లు, ఆర్బీకేలు, అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించామన్నారు. రూ.22 కోట్లతో పీఎస్‌పేటతోపాటు నియోజకవర్గంలో పలు పంచాయతీరాజ్ రోడ్లకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. నాలుగు నియోజకవర్గాలకు ప్రధాన రహదారి అయిన బీఎన్ రోడ్డు విస్తరణకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.110 కోట్లు మంజూరు చేయగా.. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరు సక్రమంగా పనిచేయకపోవడంతో రెండేళ్లుగా రోడ్డు పనులు జరగలేదన్నారు. గంధవరం-నర్సీపట్నం రోడ్డు పనుల్లో జాప్యంపై వైవీ సుబ్బారెడ్డి స్పందిస్తూ..కాంట్రాక్టరు పనిచేస్తారో లేదో తెలుసుకొని కొత్త కాంట్రాక్టరుకైనా పనులు అప్పగించి ఈ రోడ్డు పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బీవీ సత్యవతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చొరవతో పార్లమెంటు పరిధిలో కేంద్రం నుంచి అనేక అభివృద్ధి పనులు తీసుకురావడం జరిగిందన్నారు. కొన్ని ప్రధాన రహదారులకు నిధులు కూడా మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డిని న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోలా గురువులు, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, జెడ్పీటీసీ సభ్యులు దొండా రాంబాబు, తలారి రమణమ్మ, ఎంపీపీలు గాడి కాసు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, దాకవరపు నాగేశ్వరరావు, పైల రాజు, సర్పంచ్ బండి నూకాలమ్మ, న్యాయవాది కె.డేవిడ్, నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, గ్రామకమిటీలు, సచివాలయ కన్వీనర్లు సమావేశంలో పాల్గొన్నారు.

ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టండి

- అభివృద్ధి పథంలో నర్సీపట్నం
- పార్టీ నియోజకవర్గ సమావేశంలో వైవీ సుబ్బారెడ్డి



వై.వి.సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గానికి మొదటిసారిగా వచ్చిన సుబ్బారెడ్డికి ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ పార్టీ నాయకులతో కలిసి బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గంలో నాలుగైదు సార్లు గెలిచామని చెప్పుకునే నాయకుల ఆటలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వద్ద సాగవన్నారు. 2024లో కూడా నర్సీపట్నంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందన్నారు. మెడికల్ కళాశాల, తాండవ-ఏలేరు ఎత్తిపోతల పథకం, మున్సిపాలిటీలో రోడ్డు విస్తరణకు సీఎం శంకుస్థాపన చేసి వరాల జల్లు కురిపించారన్నారు. అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారులకు పథకాలు అందుతున్నాయన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలే లబ్ధి పొందాయన్నారు.

సంక్షేమ అస్త్రాలను సంధించండి..

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ పార్టీ విజయానికి అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. సంక్షేమ అస్త్రాలను సంధించి టీడీపీ నాయకుల వస్త్రాలు ఊడగొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ తాగుబోతు అయ్యన్నపాత్రుడు విమర్శలను దీటుగా తిప్పి కొట్టాలన్నారు. 2024లో టీడీపీకి బాదుడే.. బాదుడు తప్పదన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ప్రసంగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, వైద్య విభాగం నాయకులు డాక్టర్ లక్ష్మీకాంత్, ఎంపీపీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీతో సుబ్బారెడ్డికి స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు

న్యూస్‌రీల్

విజ్ఞాన, వికాసాలకు కేంద్రం ఏయూ

- త్రిదండి చిన్న జీయర్ స్వామీజీ



మైదానం ప్రాంగణంలో శమీవృక్షాన్ని నాటుతున్న స్వామీజీ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామీజీ బుధవారం సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి స్వామీజీకి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల హాస్టళ్ల మధ్య నూతనంగా అభివృద్ధి చేసిన సుమారు 16 ఎకరాల క్రీడా మైదానాన్ని స్వామీజీ ప్రారంభించి.. శక్తి స్థూపం నిర్మాణానికి భూమిపూజ చేశారు. స్వామీజీ శమీ మొక్క నాటగా.. విద్యార్థులు మైదానం చుట్టూ 108 ఔషధ గుణాలు కలిగిన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ దైవం కూడా పూజించే వృక్షంగా శమీవృక్షం నిలుస్తుందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తన పూర్వ వైభవాన్ని సంతరించుకుని మరింత పరిఢవిల్లుతుందని స్వామీజీ ఆశీస్సులు అందించారు.

అడిషనల్ ఎస్పీగా ప్రవీణ్‌కుమార్



నర్సీపట్నం: డీఎస్పీగా పని చేస్తున్న కె.ప్రవీణ్‌కుమార్‌కు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత కొన్ని నెలలుగా నర్సీపట్నం ఇన్‌చార్జి డీఎస్పీగా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నుంచి సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేసుకున్నారు.

డీఎస్పీ, ఎస్‌ఐలకు ఇండియన్ పోలీసు మెడల్స్



హార్బర్ క్రైం ఎస్‌ఐ దార సూరిబాబు

మహారాణిపేట/జగదాంబ: పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు విశాఖ జిల్లాకు చెందిన ఇద్దరు పోలీసు అధికారులను ఇండియన్ పోలీసు మెడల్స్ వరించాయి. జిల్లా శిక్షణా కేంద్రం డీఎస్పీ కొరంగి ప్రవీణ్‌కుమార్, హార్బర్ క్రైం ఎస్‌ఐ దార సూరిబాబు ఇండియన్ పోలీసు మెడల్‌కు ఎంపికయ్యారు. సూరిబాబు పలు ముఠాలను పట్టుకోవడంతో శక్తి సామర్థ్యాలు చూపించారు. నగరంలో అనేక కేసులు ఛేదించడంతో 160 రివార్డులు, 44 కమాండెషన్స్, 31 ప్రశంసా పత్రాలు పొందారు. 2007లో ఉమేషచంద్ర అవార్డు, 2016 ఏపీ పోలీసు సేవా పథకం, 2020 ఎ.బి.సి.డి అవార్డ్స్, 2021 డీజీపీ కమాండెషన్ అవార్డు, 2022లో ఏపీ పోలీసు ఉత్తమ సేవా పథకాలు వరించాయి.

1న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణం): జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ఫిబ్రవరి 1న నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో 15 అంశాలపై చర్చించేందుకు అజెండా సిద్ధం చేశారు. దీన్‌దయాళ్‌పురంతో పాటు పలు రహదారుల వెడల్పు చేసేందుకు ప్రధానంగా చర్చించనున్నారు. నగరంలో పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు సంబంధించి చర్చిస్తారని సమాచారం.

మత్తు ఇంజక్షన్లు స్వాధీనం

సీతమ్మధార (విశాఖ ఉత్తర): గుట్టుగా మత్తు ఇంజక్షన్లు సరఫరా చేస్తున్న ముఠాని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని జ్ఞానాపురం బస్టాప్ వెనుక సర్వీస్ రోడ్డులో మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తుండగా ముందుగా వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్సు, ఎస్ఈబీ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి పెంటాజోసిన్ లాక్టట్ ఇంజక్షన్లు 76 స్వాధీనం చేసుకున్నారు. దాబాగార్డెన్స్ సమీప గొల్లలపాలెంకు చెందిన చీటికిరెడ్డి వెంకట శ్రీకాంత్, టీఎస్ ఎన్‌కాలనీలో హేమ రెసిడెన్సీకి చెందిన వెన్నెల వెంకటరావు, ఇంజక్షన్లు సరఫరా చేసిన ఖరగ్‌పూర్‌కు చెందిన అనుపమ్ అధికారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అనుపమ్ అధికారి మత్తు ఇంజక్షన్లు నగరానికి తీసుకొచ్చి పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని అధికారులు తెలిపారు.

మహిళా పోలీసు మానవత్వం

- క్షతగాత్రునికి తక్షణ ఆరోగ్యశ్రీ కార్డు, శస్త్ర చికిత్స



క్షతగాత్రుడు సన్యాసిరావును 108లో ఆస్పత్రికి తరలిస్తున్న మెలిపాక మహిళా పోలీసు గంగాభవాని(ఫైల్)

మునగపాక: మహిళా పోలీసు మానవత్వం, సచివాలయ సిబ్బంది నిబద్ధత ఓ అభాగ్యుడిని ఆదుకుంది. అతనికి తక్షణ ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు చేయడంతోపాటు, శస్త్రచికిత్స జరిగి కోలుకునేందుకు దోహదపడింది. మెలిపాకలో ఒంటరిగా నివాసం ఉంటున్న వేములపూడి సన్యాసిరావు ఆరు రోజుల క్రితం గ్రామంలోని కాలువ దాటుతుండగా ప్రమాదవశాత్తూ కిందపడిపోయాడు. దీంతో అతని కాలు విరిగిపోయింది. అతనికి పరిచర్యలు చేసేందుకు ఎవరూ ముందుకురాకపోవడంతో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్న గంగాభవాని 108కు సమాచారం ఇచ్చింది. బాధితునితో పాటు అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి వాహనంలో వెళ్లింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆస్పత్రిలోనే ఉండి వైద్యులతో మాట్లాడి అతనికి చికిత్స అందేలా చొరవ తీసుకుంది. అనంతరం వైద్యులు కేజీహెచ్‌కు తరలించాలని సిఫార్సు చేశారు. అయితే సన్యాసిరావు కుమారులు ఎవరూ అంతగా ఆసక్తి చూపకపోవడంతో సమీపంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. సన్యాసిరావుకు ఆరోగ్య శ్రీ కార్డు లేకపోవడంతో హుటాహుటిన సచివాలయంలో దరఖాస్తు చేయించి సచివాలయ ఉద్యోగుల సహకారంతో కార్డు వచ్చేందుకు ఆమె పాటుపడింది. సంబంధిత కార్డు ద్వారా బుధవారం శస్త్ర చికిత్స జరిగేలా తన వంతు కృషి చేసి, మానవత్వాన్ని చాటుకుంది. జేసీ కల్పనాకుమారి మునగపాక మండలంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించిన విముక్తి కార్యక్రమంలో కూడా గంగాభవాని చొరవచూపింది. మద్యానికి బానిసలైన ఇద్దరిని గుర్తించి, కౌన్సెలింగ్ ఇప్పించడంతో ఇప్పుడు వారు కోలుకున్నారు.

మట్టి తరలించిన వాహనాలకు పెనాల్టీ

మాకవరపాలెం : అక్రమంగా మట్టిని తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు రూ.3 లక్షల 30 వేలు పెనాల్టీ వేసినట్టు అనకాపల్లి గనులశాఖ ఏడీ సుబ్బారాయుడు బుధవారం తెలిపారు. ఈ నెల 18న మండలంలోని గండిపేట వద్ద ఓ ప్రైవేటు భూమి నుంచి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న 11 ట్రాక్టర్లు, ఒక ప్రొక్లెయిన్‌ను గనులశాఖ అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ వాహనాల యజమానులపైనే పెనాల్టీ విధించారు.

స్టాఫ్‌నర్సు పోస్టుల రెండో విడత కౌన్సెలింగ్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సుల పోస్టులకు సంబంధించి రెండో విడత కౌన్సెలింగ్ బుధవారం నిర్వహించారు. 21 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈనెల 20న తొలి విడతలో 128 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి నియామక పత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. ఇంకా 30 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయి. విమ్స్‌లో 24 పోస్టులకు గాను తొలి విడత 18 పోస్టులు, రెండో విడత 3 పోస్టులు భర్తీ కాగా ఇంకా 3 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయి. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 108 పోస్టులకు గాను తొలి విడత 81 పోస్టులు, రెండో విడత 9 పోస్టులు భర్తీ చేశారు. 18 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏపీ వైద్య విధాన పరిషత్ పరిధిలో 47 పోస్టులకు గాను తొలి విడత 29 పోస్టులు, రెండో విడత 9 పోస్టులు నింపారు. ఇంకా 9 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఉమా సుందరి తెలిపారు. 179 పోస్టులకు గాను రెండు విడతల్లో 149 పోస్టులు భర్తీ చేశామని, ఇంకా 30 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.



ఎన్టీఆర్ స్టేడియం స్వాగత ముఖద్వారం

గణతంత్ర వేడుకలకు సిద్ధం

అనకాపల్లిటౌన్ : గణతంత్ర వేడుకలకు స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానం సర్వాంగసుందరంగా ముస్తాబైంది. స్టేడియం ముఖ ద్వారం వద్ద భారత మాత ముఖ చిత్రంతోపాటు 74వ గణతంత్ర వేడుకలకు స్వాగతం పలుకుతూ రూపొందించిన ప్రవేశ ద్వారం చూపరులను ఆకట్టుకుంటోంది. గురువారం జరిగే వేడుకల్లో జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మువ్వన్నెలజెండా ఎగురవేయనున్నారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించనున్నారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించనున్నారు.

సామాన్యుని చేతిలో పాశుపతాస్త్రం



నెహ్రూచౌక్ కూడలిలో విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తల మానవహారం

- ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి
- ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అనకాపల్లి టౌన్: ఓటు సామాన్యుడి చేతిలో పాశుపతాస్త్రమని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక రింగ్‌రోడ్డులో అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొంది, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా తమకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఓటర్ల నమోదు కోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కొత్తగా చేరిన వారితో కలిపి జిల్లాలో 12 లక్షల 518 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. నెహ్రూచౌక్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారంగా ఏర్పడి ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేశారు. జేసీ కల్పనాకుమారి, డీఆర్వో వెంకటరమణ, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ గంగాధరరావు, ఎంఈవో దివాకర్, వివిధ కళాశాలల విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగంతోనే స్వాతంత్ర్య పరిరక్షణ

- దామోదరం సంజీవయ్య లా వర్సిటీ వీసీ సూర్యప్రకాష్

8లో

ప్రత్యామ్నాయం.. పరివర్తనం..

- నాటు సారా నియంత్రణ చర్యలు విజయవంతం
- 'ఆపరేషన్ పరివర్తన-2'తో సత్ఫలితాలు
- తయారీదారులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి
- 67 మంది డ్వాక్రా మహిళలకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ నుంచి రూ.31.5 లక్షలు మంజూరు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ గౌతమి సాలి (ఫైల్)

సాక్షి, అనకాపల్లి: ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు చూపడంతో సారా తయారీదారుల్లో క్రమంగా 'పరివర్తన' వస్తోంది. పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారుల శ్రమ ఫలిస్తోంది. అక్రమ సారా నియంత్రణకు 'ఆపరేషన్ పరివర్తన్-2' పేరిట గ్రామాల్లో చక్కని అవగాహన కల్పించడంతో మార్పు కనిపిస్తోంది.

సారా తయారు చేసే కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించే దిశగా రుణ సహాయం అందజేస్తున్నారు. గత ఏడాది సారాయి కేసుల్లో పట్టుబడిన వారు.. తయారీదారులను గుర్తించి వారికి ఈ అవకాశం కల్పిస్తున్నారు. సారా ఎక్కువగా తయారు చేసే గ్రామాలను గుర్తించి వారిలో పూర్తి పరివర్తన తీసుకువచ్చే విధంగా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 67 మంది కుటుంబాలకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ నుంచి ఇటీవల రూ.31.5 లక్షలు మంజూరు చేశారు.

మారకుంటే ఎన్‌డీపీఎస్ కేసులు

ఆదాయం కోసం, కుటుంబ అవసరాల కోసం సారా తయారీదారులు దారి తప్పుతున్నారు. వీరిలో ఎక్కువమంది మహిళలు ఉంటున్నారు. పరివర్తన-2 కార్యక్రమం ద్వారా మంచి నడవడికతో గౌరవప్రదంగా నడుచుకోవాలని, స్వయం ఉపాధి పథకాల ద్వారా కుటుంబాన్ని పోషించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయినా మారకుంటే వారిపై ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు తప్పదని ఎస్ఈబీ అధికారులు హెచ్చరిస్తున్నారు.

గతేడాది జిల్లాలో సారా తయారీ, అమ్మకం చేసిన కుటుంబాలు 207

వీరిలో పూర్తిగా సారాయి మానేసి ఇతర ఉపాధి మార్గాలను ఎంచుకున్న కుటుంబాలు 98

వారిలో 67 మందికి రుణ మంజూరు రూ.31.50 లక్షలు

లబ్ధి పొందినవారు 21 మంది మహిళలు, 46 మంది పురుషులు

వీరిలో బీసీలు 22, ఓసీలు 7, ఎస్సీలు 38 మంది

ప్రత్యామ్నాయ ఉపాధి పొందారిలా..

ఉపాధి మార్గం	కుటుంబాలు	రుణ మొత్తం రూ.లలో
పాడి పశువుల పెంపకం	26	11.95 లక్షలు
గొర్రెలు, మేకల పెంపకం	17	7.35 లక్షలు
వ్యవసాయం	9	4.30 లక్షలు
కిరాణ షాప్	5	2.30 లక్షలు
టిఫిన్ షాప్	3	2 లక్షలు
పందుల పెంపకం	2	లక్ష
విస్తరాకుల వ్యాపారం	1	30 వేలు
ఆటో	1	50 వేలు
చికెన్ షాప్	1	లక్ష
కొబ్బరి వ్యాపారం	1	30 వేలు
చాపల తయారీ	1	50 వేలు

సారారహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం..



సారారహిత జిల్లాగా అనకాపల్లి జిల్లాను తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది. ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పిస్తున్నాం. రెవెన్యూ అధికారులు, వలంటీర్లు, సచివాలయ మహిళా పోలీసులు ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు సారా నియంత్రణకు పనిచేస్తున్నారు. – లక్ష్మీపతి, డీఆర్‌డీఏ పీడీ

లక్ష్య నిర్దేశకులదే విజయం


జయకేతనం: రఘు టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ జట్టు


విజయదరహాసం: ఎస్ఆర్ జూనియర్ కళాశాల జట్టు


విజయహేల: ఏవీఎన్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు

హోరాహోరీగా 'సాక్షి'ప్రీమియర్ లీగ్

విశాఖ స్పోర్ట్స్: 'సాక్షి'ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) క్రికెట్ టోర్నీలో రెండో రోజు పోటీల్లో లక్ష్య నిర్దేశకులే విజయం సాధించారు. లక్ష్య ఛేదనలో వెనుకబడి జట్లు పరాజయం పాలయ్యాయి. 'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో బుధవారం జరిగిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడు మ్యాచ్‌ల్లో టాస్ ఓడిన జట్లు తొలుత బ్యాటింగ్ చేసి లక్ష్యాన్ని నిర్దేశించి విజయం సాధించాయి. జూనియర్స్‌కు జరిగిన హోరాహోరీ పోరులో సాంకేతిక పాలిటెక్నిక్ జట్టు కేవలం ఒక్క పరుగు వెనుకబడి ఓటమి పాలైంది. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో జరుగుతున్న ఈ పోటీలకు సీఎంఆర్ షాపింగ్‌మాల్ డిస్ట్రిక్ట్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.

- రెండో రోజు తొలి మ్యాచ్‌లో రఘు టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 10 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 71 పరుగులు చేసింది. పాల్ 19 పరుగులు చేశాడు. వరుణ్ మూడు వికెట్లు తీశాడు. ప్రతిగా దాడి వీరునాయుడు డిగ్రీ కళాశాల నాలుగు వికెట్లు కోల్పోయి 63 పరుగులే చేసి ఓటమి పాలైంది. సాయి 26 పరుగులు చేశాడు.
- తర్వాత మ్యాచ్‌లో ఎస్ఆర్ జూనియర్ కళాశాల టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఎనిమిది ఓవర్లలో ఒక వికెట్‌కు 126 పరుగులు చేసింది. రాజ్‌కుమార్ (54) అర్ధసెంచరీ సాధించాడు. ప్రతిగా అశ్వార్‌దాస్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 37 పరుగులే చేసి ఓటమి పాలైంది. హర్ష రెండు వికెట్లు తీశాడు.
- మరో మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన సాయిగణపతి పాలిటెక్నిక్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసింది. తనిష్క్ 34 పరుగులు చేశాడు. వంశీ, మురళి రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా ఎస్వీఎల్ఎస్ఎస్వీపీ జూనియర్ కళాశాల జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 52 పరుగులే చేసి ఓటమి పాలైంది. చందు 26 పరుగులు చేశాడు. కుమార్ రెండు వికెట్లు తీశాడు.
- చివరి మ్యాచ్‌లో ఏవీఎన్ కళాశాల జట్టు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. మూడు వికెట్లకు 81 పరుగులు చేసింది. 33 అదనపు పరుగులు లభించాయి. ప్రతిగా సాంకేతిక జట్టు బ్యాటర్ వివేక్ 20 బంతుల్లోనే 38 పరుగులు చేసినా.. చివరికి మూడు వికెట్లు కోల్పోయి 80 పరుగుల వద్ద ఇన్నింగ్స్ ముగిసింది. హర్ష, చెన్నారావు, మోహన్ చెరో వికెట్ తీశారు.


విజయోత్సాహం: సాయిగణపతి పాలిటెక్నిక్ కళాశాల జట్టు

ఓటు హక్కు వినియోగంతోనే స్వాతంత్ర్య పరిరక్షణ


సీనియర్ సిటిజన్ సూర్యనారాయణను సత్కరిస్తున్న సూర్యప్రకాష్, రవి పట్టాన్‌శెట్టి


విద్యార్థులకు ఓటరు కార్డులందిస్తున్న సూర్యప్రకాష్



ఈవీఎం మిషన్ బటన్‌నొక్కే నమూనా

- దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి సూర్యప్రకాష్

అనకాపల్లి టౌన్: ఓటు హక్కు వినియోగించుకోవడమే రాజ్యాంగాన్ని, దేశ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించడమవుతుందని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్.సూర్యప్రకాష్ అన్నారు. మండలంలో గుండాల కూడలిలోని సచివాలయంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధ్యక్షతన ఓటు ప్రాముఖ్యతపై బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఎందరో మహానుభావుల బలిదానాల ద్వారా సాధించిన స్వాతంత్ర్యం మనం వేసే ఓటు ద్వారానే పరిరక్షించబడుతుందని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సారథ్యంలో మనం రాజ్యాంగాన్ని రూపొందించుకున్నామని, దాని పరిరక్షణకు ఎన్నికలు జరుపుకొంటున్నామన్నారు. ప్రతీ ఒక్కరూ నిర్భయంగా, నిష్పక్షపాతంగా సమర్థుడైన నాయకుడికి ఓటు వేయాలని సూచించారు. ఓటు ద్వారానే మన భవిష్యత్‌ని మనం నిర్ణయించుకోవచ్చన్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ ఓటు విలువను ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని కోరారు. దేశాభివృద్ధికి మీ భాగస్వామ్యం ఓటు ద్వారానే లభిస్తుందని సూచించారు. ఎస్పీ గౌతమి సాలి మాట్లాడుతూ మనదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశమన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు పొందవచ్చని చెప్పారు. నూతనంగా ఓటు హక్కుపొందిన విద్యార్థులకు ఓటరుకార్డులను అందజేశారు. అంతకుముందు సీనియర్ సిటిజన్లు సారిపల్లి సూర్యనారాయణ, కాండ్రేగుల అప్పారావు(కెప్టెన్), దివ్యాంగుడు కలవలపల్లి మదన్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేసీ కల్పనాకుమారి, డీఆర్వో వెంకటరమణ, ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ గంగాధరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాచీన దేవాలయాల అభివృద్ధికి టీటీడీ నిధులు

- టీటీడీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి


సుబ్బారెడ్డిని కలిసి సత్కరిస్తున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఎండీ, కార్మికసంఘం నాయకులు

చోడవరం: దేశంలో అన్ని ప్రాచీన దేవాలయాల అభివృద్ధికి తిరుమల,తిరుపతి దేవస్థానం నుంచి సహకారం అందిస్తున్నామని టీటీడీ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ విశాఖ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. చోడవరంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చోడవరం పరిసరాల్లో ఉన్న ప్రముఖ ప్రాచీన దేవాలయాల అభివృద్ధికి టీటీడీ నుంచి నిధులు మంజూరు చేయాలని చైర్మన్‌ను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. దీనిపై సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోనే కాకుండా దేశంలో అనేక ప్రముఖ ప్రాచీన దేవాలయాలకు అభివృద్ధికి మూడేళ్ల నుంచి టీటీడీ నిధులు మంజూరు చేస్తునట్టు చెప్పారు. చోడవరంలో ప్రాచీన దేవాలయాలైన స్వయంభూ విఘ్నేశ్వరస్వామి, స్వయంభూ గౌరీశ్వరస్వామి, కేశవస్వామి ఆలయాలతోపాటు వడ్డాది వేంకటేశ్వరస్వామి, రోలుగుంట వేంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధికి టీటీడీ నుంచి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఏఏ దేవాలయాల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేయాలో లేఖ రూపంలో ఇస్తే టీటీడీ ఇంజినీరింగ్ అధికారులను పంపించి ప్రతిపాదనలు తయారు చేయడంతో పాటు రెండు నెలల్లో మంజూరు కూడా చేస్తామని హామీ ఇచ్చారు.

గోవాడ సుగర్స్ విషయం సీఎం దృష్టికి..

చెరకు రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని వై.వి. సుబ్బారెడ్డి అన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని పరిశీలించిన ఆయనకు ఫ్యాక్టరీ ఆర్థిక పరిస్థితి, ప్రస్తుత పరిస్థితిపై ధర్మశ్రీ వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రూ.150 కోట్ల అప్పుల్లో ఫ్యాక్టరీ కూరుకుపోయిందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ వచ్చాక రూ.120 కోట్ల అప్పు తీర్చడంతోపాటు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కొంత గ్రాంట్ ఇచ్చి ఆదుకున్నారని ధర్మశ్రీ వివరించారు. అయితే ఫ్యాక్టరీ రానున్న రోజుల్లో మరింతగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వ సహకారంతోపాటు ఉప ఉత్పత్తుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీనికి సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారు. చెరకు రైతుల సంక్షేమంతోపాటు ఫ్యాక్టరీ అభివృద్ధి విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి. సన్యాసినాయుడు, ఏవో పప్పల రమణమూర్తి, గుర్తింపు కార్మిక సంఘం నాయకుడు కె.వి.వి.భాస్కరరావు తదితరులు మర్యాదపూర్వకంగా సత్కరించారు. అనంతరం ఫ్యాక్టరీ, కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

వడ్డాది వెంకన్న ఆలయం అభివృద్ధికి వినతి

బుచ్చెయ్యపేట: వడ్డాది వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. చోడవరం వచ్చిన సుబ్బారెడ్డిని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు,ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి,జెడ్పీటీసీ దొండా రాంబాబు,డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ,వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణ మూర్తి తదితరులు బుధవారం కలిసి మండల సమస్యలను వివరించారు. విశాఖ,అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల ప్రజలకు ముఖ్య రహదారి అయిన భీమునిపట్నం-నర్సీపట్నం రోడ్డులో వడ్డాది పెద్దేరు నదిపై ఉన్న వంతెన కూలిపోయిందని, కొత్త వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు.

చైతన్య కళాశాల విద్యార్థిని ఆత్మహత్య

కొమ్మాది: బీచ్‌రోడ్‌లోని చైతన్య కళాశాల హాస్టల్‌లో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడలో గల చైతన్య కళాశాలలో అనకాపల్లి జిల్లా మునగపాకకు చెందిన విద్యార్థిని అనూష యాదవ్(17) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తోటి విద్యార్థినులతో చదువుకుంది. అనంతరం తన గదిలోకి వెళ్లి ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో తోటి విద్యార్థినులు వెళ్లి చూసేటప్పటికి అనుమానాస్పదంగా మృతి చెంది ఉంది. అయితే చదువు ఒత్తిడి తట్టుకోలేకనో, మరేమైనా కారణాల వల్లో అనూష ఆత్మహత్య చేసుకుని ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ లక్ష్మణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

నర్సీపట్నం : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారన్న కారణంగా నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్మాలన్‌రాజును గురుకుల సొసైటీ కార్యదర్శి సస్పెండ్ చేశారు. సాల్మన్‌రాజు స్థానంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా శివప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు.

ప్రతిష్టాత్మకంగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్




జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో స్పెషల్ సీఎస్ కరికాల్ వలవెన్, పరిశ్రమ శాఖ డైరెక్టర్ సృజన, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, సీపీ శ్రీకాంత్, జేసీ విశ్వనాథన్, హాజరైన వివిధ శాఖల అధికారులు

- ఏయూ వేదికగా మార్చి 3, 4 తేదీల్లో నిర్వహణ
- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి అమర్‌నాథ్ వెల్లడి

మహారాణిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సదస్సు నిర్వహణ, ఏర్పాట్లకు సంబంధించి బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.కరికాల్ వలవెన్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.సృజన పాల్గొన్న ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఈ సమ్మిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి సుమారు 2,500 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించి.. పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రోడ్‌షోలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అగ్రికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వెహికల్స్, టెక్స్ టైల్స్, ఇండస్ట్రియల్ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్టక్చర్, పెట్రోలియం అండ్ పెట్రోలియం కెమికల్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, టూరిజం, ఎంఎస్ఎంఈ, స్టార్టప్స్ వంటి 13 రంగాలకు సంబంధించిన కంపెనీలను ఆకర్షించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ కల్పనకు ఈ సదస్సు ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. సదస్సుకు సంబంధించి జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని.. సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి సమ్మిట్‌ను విజయవంతం చేయాలని ఆదేశించారు.

స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.కరికాల్ వలవెన్ మాట్లాడుతూ రాష్ట్రం పెట్టుబడులకు గమ్యస్థానమన్నారు. విశాఖ వేదికగా మార్చిలో రెండు అంతర్జాతీయ సదస్సులు జరుగుతున్నాయన్నారు. ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో నిర్వహించే ఈ సదస్సుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తిలకించేందుకు ఐదు ఎకరాల్లో 250 స్టాళ్లతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పట్టణంలోని పర్యాటక ప్రాంతాలు, కూడళ్లు, రోడ్లను అందంగా తీర్చిదిద్దాలన్నారు. పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.సృజన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సదస్సుకు సకాలంలో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వి.రవీంద్రనాథ్, ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బి.ఎస్.నాగేంద్ర పుణ్యశీల, హ్యాండిక్రాఫ్ట్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బి.విజయలక్ష్మి, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ కె.వెంకటరెడ్డి, సీపీ సీహెచ్ శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించే ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానాన్ని మంత్రి అమర్‌నాథ్ ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను తెలియజేసి.. ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలను ఆకర్షించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు మీడియాతో చెప్పారు. పారిశ్రామిక వేత్తలతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

భాష పరిరక్షణ.. విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యం


- తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్ నందమూరి.లక్ష్మీపార్వతి


పాల్గొన్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): తెలుగు భాషను పరిరక్షిస్తూనే రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల అభ్యున్నతికి బాటలు వేస్తోందని తెలుగు, సంస్కృతం అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి స్పష్టం చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బుధవారం ×మాతృభాషా చైతన్యం₹ అంశంపై సంస్థ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. లక్ష్మీపార్వతి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో అంతర్జాతీయ అవకాశాల సాధన దిశగా పేద విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను అందుబాటులోకి తెచ్చిందన్నారు. అయితే ప్రతి విద్యార్థి ఒక సబ్జెక్టును కచ్చితంగా తెలుగులోనే చదవాలనే నిబంధన ఉందన్నారు. గత ప్రభుత్వాలు కార్పొరేటర్ స్కూల్ యాజమాన్యాలకు లబ్ధి చేకూర్చేందుకు తెలుగు అకాడమీని నిర్లక్ష్యం చేశాయన్నారు. యూనివర్సిటీల స్థాయిలో తెలుగుపై అవగాహన కల్పించేందుకు మాతృభాషా చైతన్యంపై సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, అధికార భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.విజయబాబు మాట్లాడారు. అనంతరం వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి, మరడాన శ్రీనివాసరావును సత్కరించారు. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, ఏయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య జె.అప్పారావు, విశ్వనాథం పీఠం పి.సీతారామ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌పై చర్యలు తీసుకోండి

- పురపాలకశాఖ ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే కన్నబాబు రాజు ఆదేశం


క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

యలమంచిలి: పురపాలక సంఘంలో పలు అవినీతి ఆరోపణలకు సంబంధించి యలమంచిలి మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) పురపాలక శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్, అధికారులు, వార్డు కౌన్సిలర్లతో ఎమ్మెల్యే సమీక్షించారు. పట్టణ పరిధిలో నిర్మిస్తున్న భారీ మంచి నీటి పథకం పనుల పురోగతిపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి పాల్పడుతున్న అక్రమాలు, అవినీతి చర్యలపై మున్సిపల్ వైస్ ఛైర్మన్లు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు మరిణేశ్వరరావు, రాపేటి సంతోష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు. ముఖ్యంగా కొందరు పారిశుధ్య కార్మికుల పేరుతో నకిలీ మస్తర్లు వేసి వేతనాల రూపంలో లక్షల రూపాయల నిధులు స్వాహా చేసినట్టు, పట్టణంలో చెత్త కుండీల కొనుగోళ్ళు, పంపిణీలో అక్రమాలకు పాల్పడినట్టు కమిషనర్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే పురపాలక శాఖ ఆర్డీకి, రాష్ట్ర కమిషనర్‌కు ఫోన్ చేసి యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. మూడు నెలల క్రితమే కమిషనర్ తీరు మార్చుకోవాలని చెప్పినా వినలేదని అందుకే కమిషనర్ అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోమని సిఫార్సు చేసినట్టు ఎమ్మెల్యే కన్నబాబురాజు బుధవారం రాత్రి సాక్షికి తెలిపారు. అవినీతికి పాల్పడే అధికారులను ఉపేక్షించేది లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

● ఘనంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు..


గవరపాలెం గౌరీపరమేశ్వరుల కల్యాణోత్సవంలో భాగంగా 1000 మంది ముత్తయిదువలు తమ ఇళ్లల్లో తయారు చేసిన సంప్రదాయ వంటకాల సారెను పరివారంతో ఊరేగించారు. సతకం పట్టు, సంతబయలు, చింతావారి వీధి, మెయిన్‌రోడ్డు, పార్కు జంక్షన్ మీదుగా ఊరేగింపు ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె నివేదించారు.

సాగులో చెరకు దిగాలు



తయారు చేసిన బెల్లం దిమ్మెలు



ఏనుగుతునిలో తెగులు సోకి ఎదుగుదల లేని చెరకు

- ఏటా తగ్గుతున్న సాగు విస్తీర్ణం
- మూడేళ్లలో సగానికి పడిపోయిన సాగు
- గిట్టుబాటు ధర లేకే ఈ స్థితి–రైతులు
- పంట మార్పిడితో ప్రయోజనం – వ్యవసాయ అధికారులు

కశింకోట : మండలంలో చెరకు సాగు విస్తీర్ణం ఏటా తగ్గుతోంది. సాధారణ విస్తీర్ణం కంటే బాగా క్షీణిస్తోంది. పంట ఎదుగుదల లేకపోవడం, దిగుబడి తగ్గిపోవడం, పెట్టుబడులు పెరిగిపోవడం, మార్కెట్‌లో తగిన ధర లేక ఆశించిన మేరకు ఆదాయం రాకపోవడం తదితర కారణాలతో చెరకు సాగుపై ఆసక్తి చూపట్లేదని రైతులు చెప్తున్నారు. మండలంలో ఒకప్పుడు పంటల సాగులో చెరకు అగ్రస్థానంలో ఉండేది. ఇప్పుడు ఆ స్థానాన్ని వరి ఆక్రమించింది.

ఐదేళ్ల క్రితం అగ్రస్థానంలో చెరకు

మండలంలో ఎక్కువగా ఖరీఫ్ సీజన్లో వరి, చెరకు పంటలు సాగు చేస్తుంటారు. సుమారు ఐదేళ్ల క్రితం వరకు చెరకు ఎక్కువగా సాగు చేసేవారు. ఇప్పుడు వరి సాగువేపు రైతులు మళ్లారు. చెరకు పంట దిగుబడి బాగా తగ్గి, ఆశించిన ఆదాయం రావడం లేదు. ఇక్కడ ఎక్కువగా చెరకును బెల్లం తయారీకి వినియోగిస్తారు. గతంలో ఎకరాకు కనీసం 25 టన్నుల వరకు దిగుబడి వచ్చేది. ఇప్పుడు అది సగానికి పడిపోయింది. భూమిలో సారం తగ్గిపోవడంతో ఎదుగుదల లేకపోవడం, మూడేళ్లకోసారి పంట మార్పిడి చేయకపోవడం, రెండుమూడేళ్ల పాటు కార్శి తోటలుగా పెంచుతుండటం, తెగుళ్ల వ్యాపించి ఎండిపోతుండటం ఈ పరిస్థితికి కారణంగా వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

గిట్టుబాటు కాక..

మరోవైపు మార్కెట్లో బెల్లానికి గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులంటున్నారు. టన్నుంపావు చెరకు నుంచి తీసిన రసం ఒక విడత పాకానికి సరిపోతుంది. పాకం నుంచి బెల్లం తయారయ్యాక మార్కెట్‌కు తరలిస్తే ఆశించిన మేరకు ఆదాయం రావడం లేదు. కూలీ ధరలు, సాగులో పెట్టుబడులు, రవాణా ఖర్చులు కూడా గతంలో కంటే బాగా పెరిగిపోయాయి. పాకం బెల్లానికి రూ.2 వేలు ఆదాయం వస్తే ఖర్చులకే సరిపోవట్లేదని, గిట్టుబాటు కావడం లేదని రైతులంటున్నారు. దీంతో చెరకు సాగుపై రైతుల విరక్తి చూపుతున్నారు.

సగానికి తగ్గిన సాగు విస్తీర్ణం

గత మూడేళ్లలో మండల పరిధిలో చెరకు విస్తీర్ణం క్రమేపీ క్షీణిస్తూ.. సగానికి పడిపోయింది. 2020లో సాధారణ విస్తీర్ణం 1558 ఎకరాలకుగాను 1216 ఎకరాల్లో సాగు చేశారు. 2021లో సాధారణ విస్తీర్ణం 1431ఎకరాలకు 850 ఎకరాల్లో చెరకు పంట వేశారు. 2022లో 1277 ఎకరాల సాధారణ విస్తీర్ణానికి కేవలం 740 ఎకరాల్లో మాత్రమే చెరకు సాగులో ఉంది. ఇలా ఏటా చెరకు సాగు తగ్గిపోతోంది. ఇక అదే పరిస్థితిలో వరి విస్తీర్ణం క్రమేపీ పెరుగుతోంది. చెరకు సాగు ఆశాజనకంగా లేకపోవడంతో కొందరు రైతులు వరి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది 1144 హెక్టార్లలో వరి వేశారు. అంతకు ముందు ఏడాది సుమారు 850 హెక్టార్లలో వేశారు. అయితే బెల్లానికి గిట్టుబాటు ధర అందిస్తే చెరకు సాగు ఆశాజనకంగా ఉండగలదని రైతులు పేర్కొంటున్నారు.

పంట మార్పిడి లేకే..

పంట మార్పిడి లేకపోవడం, భూసారం క్షీణించడం, చెరకు కార్శి తోటలను మూడేళ్ల వరకు సాగు చేయడం తదితర కారణాల వల్లే చెరకు దిగుబడి తగ్గినట్టు నివేదికలు చెప్తున్నాయి. మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేపట్టాలి. అందుకు అనుగుణంగా ఎరువులు వాడి భూసారాన్ని పెంపొందించాలి. వాటిలో అనువైన రకాల పంటలనే సాగు చేయాలి. కనీసం ప్రతి మూడేళ్లకు పంట మార్పిడి చేయాలి.

–ఎం.స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట

క్లుప్తంగా

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు



తహసీల్దార్ కార్యాలయాన్ని జెండాలతో ముస్తాబు చేస్తున్న సిబ్బంది

కశింకోట : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో గురువారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలు, కార్యాలయాలను అందంగా అలంకరించారు. రంగు కాగితాలతో జెండాలు అంటించారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, పోలీసు స్టేషన్, పంచాయతీ కార్యాలయాలు, స్కూళ్లలో జాతీయ పతాకాన్ని ఎగుర వేయడానికి ఏర్పాట్లు చేశారు.

డైట్‌లో ఓటర్ల దినోత్సవం



విద్యార్థినులతో ప్రిన్సిపాల్ చల్లా నర్సింహం

అనకాపల్లిటౌన్ : స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చల్లా నర్సింహం మాట్లాడుతూ ఓటు ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూదంలో ఐదుగురి అరెస్ట్

కశింకోట : మండలంలోని నూతలగుంట పాలెం శివారులో బుధవారం కోడి పందాలాడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారి నుంచి రెండు పందెం కోళ్లు, రూ.810 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అలాగే బల్లాట ఆడుతున్న బి.ఈశ్వరరావును అరెస్టు చేసి, రూ.723 నగదు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.

అనకాపల్లిటౌన్ : మండలంలోని కోడూరు పంచాయతీ గొల్లపేట గ్రామంలో బల్లాట నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అదుపులోకి తీసుకున్నట్టు గ్రామీణ ఎస్ఐ నర్సింగరావు తెలిపారు. వారి నుంచి రూ.220 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
వాల్తేరు వీరయ్య	- సత్యనారాయణ స్క్రీన్-1
వీర సింహారెడ్డి	- సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	- షిర్డిసాయి
వారసుడు	- పర్తిసాయి
వీర సింహారెడ్డి	- వెంకటేశ్వర
వారసుడు	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 6,585 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,510	4,230
మొదటి రకం	3,170	3,460
రెండో రకం	2,890	3,250
మూడో రకం	2,800	2,880

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 29 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–1 యూనిట్, బీ పాజిటివ్–12 యూనిట్లు, బీ నెగిటివ్–1 యూనిట్, ఓ పాజిటివ్ 10 యూనిట్లు, ఓ నెగిటివ్–2 యూనిట్లు, ఏబీ పాజిటివ్–3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 483 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

నేత్రపర్వంగా గౌరీపరమేశ్వరుల కల్యాణోత్సవం



గౌరీపరమేశ్వరుల కల్యాణంలో పాల్గొన్న సంతోష్ అప్పారావునాయుడు దంపతులు



ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

- అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ సత్యవతి దంపతులు
- భారీ ఎత్తున అమ్మవారి సారె ఊరేగింపు

అనకాపల్లిటౌన్ : పట్టణంలో గవరపాలెం గౌరీపరమేశ్వరుల కల్యాణం బుధవారం నేత్రపర్వంగా సాగింది. ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాముడు, సింధుజ దంపతులచే పురోహితులు నేతేటి సుబ్రహ్మణ్యశర్మ కల్యాణం జరిపించారు. కల్యాణం వీక్షించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అంతకుమందు గౌరీపరమేశ్వరుల కల్యాణ విగ్రహాలను పురవీధులగుండా ఊరేగించారు.

భారీ ఎత్తున సారె ఊరేగింపు

ఆలయం నుంచి మధ్యాహ్నం 3 గంటలకు 1000 మంది ముత్తయిదువలు తమ ఇళ్లల్లో తయారుచేసిన బూరెలు, అరిసెలు, గవ్వలు, సున్నుండలు, పూతరేకులు, జంతికలు, మురుకులు, పాలముంజెలతోపాటు పసుపు, కుంకుమ, విభూదిలింగం, చీరలు, కూరగాయలు, వాహనాలు, ఫర్నీచర్ ఊరేగించారు. సతకంపట్టు, సంతబయల, చింతావారి వీధి, మెయిన్‌రోడ్డు, పార్కుజంక్షన్ మీదుగా ఊరేగింపు ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె నివేదించారు. తీన్మార్, బ్యాండ్, సన్నాయిమేళాలు, డీజే తదితర కార్యక్రమాలు ఊరేగింపు ముందు ఆకర్షణగా నిలిచాయి. ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు ఎంపీ దంపతులను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల నూక సత్యనారాయణ, ఆలయ ప్రతినిధులు కొణతాల బాబూరావు, కొణతాల మురళీకృష్ణ, పి.వి.రమణ, కొణతాల ప్రసాద్, దాడి కృష్ణ, పెంటకోట జగది, సూరిశెట్టి నర్సింగరావు, బుద్ద భూలోకనాయుడు, కొణతాల కృష్ణంరాజు, కాండ్రేగుల శ్రీను, కె.ఎం.నాయుడు, పాలిమేర శ్రీను, పెంటకోట సన్యాసినాయుడు, గండేపల్లి మురళీ, దొడ్డి భోగేష్, బుద్ద సంతోష్, పెంటకోట లక్ష్మీనారాయణ, మళ్ల రాజు, కొణతాల లోకేష్, పాలమరశెట్టి సూర్య, దొడ్డి జీవన్ పాల్గొన్నారు.

రథసప్తమి ఏర్పాట్ల పరిశీలన



ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న రత్నాకర్

అనకాపల్లిటౌన్ : స్థానిక సుంకరమెట్ట సూర్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 28న రథసప్తమి వేడుకలను పురస్కరించుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ సూచించారు. బుధవారం ఆయన ఆలయంలో ఏర్పాటు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. అంతకుముందు రథసప్తమి వేడుకల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి కె.ఆదినారాయణ, 80, 81వ వార్డుల కార్పొరేటర్లు కొణతాల నీలిమ, భాస్కర్, పీలా లక్ష్మీసౌజన్య, రాంబాబు దంపతులు, గౌరీ పీఏసీఎస్ చైర్మన్ కాండ్రేగుల కృష్ణ అప్పారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ, కోరుబిల్లి ఆరుద్ర, రేబాక ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



శ్రీను చిత్రపటం వద్ద పూర్వ విద్యార్థుల నివాళి

కశింకోట : స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూలు 2005లో టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సహచర మిత్రుని కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇదే బ్యాచ్‌కు చెందిన సహచర విద్యార్థి శ్రీను అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. పేదరికంలో ఉన్న శ్రీను కుటుంబాన్ని ఆదుకోవడానికి సహచర పూర్వ విద్యార్థులు విరాళాలు సేకరించారు. తాము సేకరించిన రూ.50 వేలను బుధవారం పెద్దకర్మ రోజు మిత్రుని కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా శ్రీను చిత్ర పటానికి పూర్వ విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు.

పార్టీని గెలిపించేది గృహ సారథులే



సమావేశంలో మాట్లాడుతున్న గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి వలంటీర్ పరిధిలో ఇద్దరు గృహసారథులను నియమించనున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్ అధ్యక్షతన బుధవారం సచివాలయం కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ గెలుపుకోసం పనిచేయాలని కోరారు. మండలంలో 32 పంచాయతీలకు 26 సచివాలయాల్లో 521 మంది వలంటీర్లు విధులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పార్టీకి అనుకూలంగా ఉన్న 1,042 మందిని గృహసారథులుగా నియమించాలని, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలతో పాటు, ఇతర విషయాలను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించి, తమకు తెలియజేయాలని సూచించారు. రాష్ట్రమంత్రి గుడివాడ అమర్‌నాథ్ త్వరలో నియోజకవర్గంలోని కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పి.డి.గాంధీ, పార్టీ నేతలు పడాల గణపతి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఓటర్ల దినోత్సవాన ప్రతిజ్ఞ



ఓటర్ల దినోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం పంచాయతీలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, సచివాలయ సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు



మాట్లాడుతున్న నగేష్

అనకాపల్లిటౌన్ : పట్టణంలోని గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణమండపంలో ఈనెల 27న భారీ ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్టు కొణతాల నారాయణ, సూర్యకళా ట్రస్ట్ వ్యవస్థాపకులు కొణతాల నగేష్ తెలిపారు. గవరపాలెం పార్కు సెంటర్‌లోని ట్రస్టు కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా గౌరీపరమేశ్వరుల అమ్మవారి జాతర ముందురోజు వైద్యశిబిరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గొంతు, నోరు, గర్భాశయం, రొమ్ము క్యాన్సర్ వ్యాధుల పై ప్రత్యేక వైద్య నిపుణులు ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించడం ద్వారా వ్యాధిని నిర్మూలించవచ్చన్నారు. దీంతోపాటు వివిధ రకాల వ్యాధులపై సాధారణ వైద్య పరీక్షలు కూడా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

పార్టీ బలోపేతానికి మరింత కృషి



సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట : మండలంలో వైఎస్సార్ సీపీ మరింత బలోపేతం కావడానికి కృషి చేయాలని ఎంపీపీ కలగా లక్ష్మి కోరారు. స్థానిక పార్టీ సచివాలయ కన్వీనర్లతో బుధవారం మండల కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, కన్వీనర్లు సమన్వయంతో ప్రతి గ్రామ వలంటీర్ పరిధిలో ఇద్దరేసి సమర్థులైన గృహ సారథులను నియమించాలన్నారు. వారి సాయంతో పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గ్రామాల్లో పార్టీని మరింత పటిష్టం చేయాలని సూచించారు.

బాలికల హైస్కూల్లో ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఎంఈవో చిట్టిబాబు

కశింకోట : కశింకోటలోని బాలికల హైస్కూల్లో విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రంగులతో వినూత్న రీతిలో ముగ్గులు వేసి ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నారు. పోటీలో విజేతలుగా వి.హారిక, కె.ఆమని, బి.రేవతి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి గురువారం పాఠశాలలో జరిగే గణతంత్ర వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు హెచ్ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి, పీడీ పెంటకోట కమల తెలిపారు. ఎంఈవో చిట్టిబాబు, పేరంట్స్ కమిటీ చైర్మన్ యల్లపు శ్రీనివాసరావు తదితరులు పోటీలను పర్యవేక్షించారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

అనకాపల్లిటౌన్ : స్థానిక సాయికుల్వంత్ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం క్యాన్సర్‌వ్యాధి అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన అగనంపూడి క్యాన్సర్ ఆస్పత్రి వైద్యాధికారిణి డోలో రోసా ఫెర్నాండెజ్ హాజరై మాట్లాడారు. గొంతు, నోరు, రొమ్ము క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ మైఖేల్, కార్యదర్శి ఎం.రాకేష్, కోశాధికారి డీఎస్‌పీ రత్నాజీరావు, కళాశాల కరస్పాండెంట్ కామరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణ రద్దుకు డిమాండ్



సంఘీభావ దీక్షలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ

అనకాపల్లి రూరల్ : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. బుధవారం అనకాపల్లి పార్టీ కార్యాలయం వద్ద ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన సంఘీభావ దీక్షకు హాజరైన ఆయన కేంద్ర ప్రభుత్వ విధానాన్ని తప్పుబట్టారు. ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్లకు ధారాదత్తం చేయడానికే కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు నిర్ణయాల కారణంగా దేశంలో సామాన్య ప్రజలు జీవించలేని పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలపై పోరాటం చేయడానికి ఈ నెల 30న విశాఖలో జరగనున్న మహా గర్జనకు వామపక్ష పార్టీలు, వాటి అనుబంధ సంఘాలు, ప్రజా, విద్యార్థి సంఘాలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, సీపీఐ కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, కె.సన్యాసిరావు, రెడ్డిపల్లి అప్పలరాజు, మళ్ళ మాధవరావు, వై.ఎన్.భద్రం, నాగరాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.కన్నబాబు, వియ్యపు రాజు పాల్గొన్నారు.

‘పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత’



ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ సూర్యకుమారి, జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల

సబ్బవరం: పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావుతో కలిసి బుధవారం పలు పంచాయతీలకు ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు రూ.8.68 లక్షలతో రెండో విడతలో 21 ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఇప్పటి వరకూ మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు రూ.18.20 లక్షలతో 44 ట్రై సైకిళ్ల పంపిణీ చేసినట్లు ఎంపీపీ సూర్యకుమారి చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు నారాయణమూర్తి, ఎంపీడీవో రమేష్ నాయుడు, నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, సర్పంచ్‌లు మోపాడ అప్పారావు, వద్దాది అప్పలరాజు, ఏవో ఎస్ బాబూరావు, ఈవోఆర్‌డీ మహేష్, యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

‘బొజ్జన్నకొండ వద్ద పర్యాటక దినోత్సవం’

అనకాపల్లిటౌన్ : జాతీయ పర్యాటక దినోత్సవాన్ని మండలంలోని బొజ్జన్నకొండ వద్ద ప్రతి ఏటా నిర్వహించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం జిల్లా అధికారుల్ని కోరారు. కొండవద్ద బుధవారం ఆయన కొండ చరిత్ర కరపత్రాలను పంపిణీ చేశారు.

శారదా బ్రిడ్జిపై వ్యర్థాలు తొలగించాలి

అనకాపల్లిటౌన్ : స్థానిక శారదానది కొత్త, పాత బ్రిడ్జిలపై పేరుకుపోయిన ఇసుక, మట్టి, చెత్తాచెదారాలను తొలగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని నేషనల్ సోషల్ జస్టిస్ ఫోరం జిల్లా ప్రధానకార్యదర్శి సూదికొండ మాణిక్యాలరావు కోరారు. బుధవారం బ్రిడ్జిపై ఆయన నిరసన ప్రదర్శన చేపట్టారు. ఫుట్‌పాత్‌లపై వ్యర్థాలతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.